నార్సింగ్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బ్లాక్‌మెయిలింగ్, బెదిరింపులకు తాళలేక ఓ వ్యక్తి చిన్నపిల్లలైన ముగ్గురు కొడుకుల్ని చంపి, తాను ఆత్మహత్య చేసుకున్న కేసులో మొకిలా పోలీసులు ఐదుగురు విలేకరులు, హోంగార్డు సహా 9 మందిపై కేసు నమోదు చేశారు. వీరిలో ముగ్గుర్ని అరెస్టు చేసినట్టు రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ నెల 3న శంకర్‌పల్లి మండలం టంగుటూరు గ్రామంలో నీరటి రవి అనే వ్యక్తి తన ముగ్గురు పిల్లలను హత్య చేసి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. రవి జీఎస్ఎన్ కంపెనీలో మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో కొంతమంది చేత డబ్బులు పెట్టించాడు. అయితే ఆ కంపెనీ నుంచి డబ్బులు తిరిగి రాలేదు. ఈ విషయం తెలిసి ఈ ఐదుగురు విలేకర్లు రవిని బెదిరించారు. తమకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. రవి తన వద్ద డబ్బులు పెట్టిన నాగరాజు అనే హోంగార్డు, అతని భార్య మనీలాకు రెండు ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇచ్చినప్పటికీ వారు కూడా తీవ్రంగా ఒత్తిడి చేశారు. తిరుపతిరావు, రామకృష్ణ అనే వ్యక్తులు, నాగరాజు, మనీలాతో పాటు విలేకర్లు కురమ శ్రీనివాస్ (ఈనాడు), మంగళి శ్రీనివాస్ (ఆంధ్రజ్యోతి), వడ్డె మహేశ్ (నమస్తే తెలంగాణ), సిరిపురం శ్రీనివాస్‌రెడ్డి (వార్త), సనికె ప్రవీణ్ కుమార్ (సాక్షి)పై కేసు నమోదు చేశామని డీసీపీ తెలిపారు. విషయం తెలిసి ఆంధ్రజ్యోతి యాజమాన్యం వారం రోజుల క్రితమే మంగళి శ్రీనివాస్‌ను తొలగించింది. ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజును అరెస్టు చేసిన పోలీసులు... మిగతా వారి కోసం గాలిస్తున్నారు.



మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా మర్రి?

నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేతో కొనసాగుతున్న సంప్రదింపులు

ఒకట్రెండు రోజుల్లో ప్రకటన!

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి త్వరలోనే హస్తం గూటికి చేరనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బుధవారం నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీలో ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరింది. శాసనసభ ఎన్నికలు ముగిసినప్పటి నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి పార్టీ మార్పుపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ నుంచి ఆయనకు ఆహ్వానాలు అందాయి. జహీరాబాద్ నుంచి బీజేపీ తరఫున లోక్‌సభకు పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నేతలు సంప్రదింపులు జరిపారు. అదేసమయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన మర్రి జనార్దన్‌రెడ్డి.. బీజేపీ నాయకులు తనను సంప్రదించిన మాట వాస్తవమేనన్నారు. కార్యకర్తలు, శ్రేయోభిలాషులతో చర్చించకుండా తాను నిర్ణయం తీసుకోబోనని చెప్పారు. అయితే, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా జనార్దన్‌రెడ్డిని ప్రకటించనున్నట్లు బలంగా ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి మల్కాజిగిరి లేదా మహబూబ్‌నగర్ స్థానాల్లో పోటీ చేయాలని ఆఫర్ ఉన్నా.. జనార్దన్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదని సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడం లాంఛనమేనని తెలుస్తోంది. కాగా, పార్టీ మారే అంశంపై జనార్దన్‌రెడ్డి మాత్రం స్పష్టత ఇవ్వడం లేదు. కాంగ్రెస్, బీజేపీలు తనను సంప్రదిస్తున్నా.. తాను ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని చెబుతున్నారు. ఒకటి రెండు రోజుల్లోనే ఈ విషయంపై కీలక ప్రకటన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

అధిష్ఠానం మాటే.. మా మాట!

» అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ నేతలు

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ఎంపిక చేస్తే వారిని గెలిపించుకుంటామని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని 13 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అభ్యర్థులు, డీసీసీ అధ్యక్షులతో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ గాంధీభవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. టికెట్ల కేటాయింపుపై అభిప్రాయాలు సేకరించారు. ఇందులో భాగంగా మెజారిటీ నేతలు అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కొద్ది మంది మాత్రం ఫలానా అభ్యర్థి అయితే సామాజికంగా, ఆర్థికంగా సరైన పోటీదారు అని అభిప్రాయాలు చెప్పారు. ఇదిలాఉంటే, ఆయా నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు.. తమ పేరును ప్రతిపాదించాలని పార్టీ నేతలను ఫోన్లు, మెసేజ్‌ల ద్వారా విజ్ఞప్తి చేయడం కొసమెరుపు.

అధినేత వద్దకు ఆరూరి

వరంగల్ టు హైదరాబాద్.. హైడ్రామా.. బీజేపీలో చేరొద్దంటూ బుజ్జగించేందుకు వెళ్లిన ఎర్రబెల్లి, సారయ్య, బీఆర్ఎస్ నేతలు



ఆరూరిని బీఆర్ఎస్ నేతలు తీసుకెళుతుండగా అడ్డుకుంటున్న అనుచరులు

హైదరాబాద్/వరంగల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బీజేపీలో చేరేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ ఇంటి వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, బీజేపీలో చేరనున్నట్లు ప్రకటించేందుకు బుధవారం ఉదయం ఆయన ఏర్పాట్లు చేసుకోగా.. బీఆర్ఎస్ నేతలు ఆయన్ను పార్టీ అధినేత కేసీఆర్ వద్దకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రమేశ్ అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగి, ఉద్రిక్తతకు దారి తీసింది. పార్టీలో తనకు అన్యాయం జరిగిందని, ఈ సమయంలో తన నిర్ణయాన్ని మార్చుకోలేనని రమేశ్ చెప్పినా బీఆర్ఎస్ నేతలు వినిపించుకోకపోవడం, మార్గం మధ్యలో బీజేపీ నాయకులు వారి వాహనాలను అడ్డుకొని ఆందోళన చేపట్టడం.. కలకలం రేపింది. ఆరూరి కిడ్నాప్ అంటూ సోషల్‌మీడియాలో ఈ విషయం వైరల్ కావడంతో వరంగల్ నుంచి బయలుదేరిన వీరి వాహనాలు హైదరాబాద్ చేరుకునే దాకా ఉత్కంఠ కొనసాగింది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆరూరి రమేశ్ బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి, సాయంత్రం ఢిల్లీకి వెళ్లి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా సమక్షంలో పార్టీలో చేరాలని భావించారు. అనుకున్నట్లుగానే వరంగల్‌లోని తన నివాసం వద్ద ముఖ్య అనుచరులతో సమావేశమైన ఆరూరి.. పార్టీలో తనకు గుర్తింపు దక్కడం లేదని, మళ్లీ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసినా తనను ఓడిస్తారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. ఉదయం 11గంటల సమయంలో మీడియాతో మాట్లాడేందుకు ఆయన ఇంట్లో నుంచి బయటకు వస్తుండగా.. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, బీఆర్ఎస్ నేతలు నాగుర్ల వెంకటేశ్వర్‌రావు, సుందర్‌రాజ్ అక్కడికి చేరుకున్నారు. 'ఒక్క నిమిషం మాట్లాడుదాం' అంటూ ఇంట్లోకి తీసుకెళ్లారు. బీజేపీలోకి వెళ్తే భవిష్యత్తు ఉండదని, పార్టీ మారొద్దని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. అంతలోనే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకుని, రమేశ్ భుజంపై చేయి వేసి కేసీఆర్ వద్దకు వెళ్దామంటూ బయటకు తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఆరూరి మద్దతుదారులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఆరూరి అనుచరులు కారుకు అడ్డుగా నిలబడి నినాదాలు చేశారు. చివరకు ఉద్రిక్తత మధ్య రమేశ్‌ను తీసుకుని హైదరాబాద్‌కు బయల్దేరగా.. మార్గమధ్యలోని జనగామ జిల్లా పెంబర్తి వద్ద బీజేపీ నాయకులు వారి వాహనాన్ని అడ్డుకొని ఆందోళనకు దిగారు. బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో 50మంది కార్యకర్తలు ఆరూరి రమేశ్‌ను బలవంతంగా కారులో నుంచి కిందకు దించారు. ఈ పెనుగులాటలో ఆరూరి రమేశ్ చొక్కా చినిగిపోయింది. బీఆర్ఎస్ నాయకులు బుజ్జగించాలని ప్రయత్నిస్తే మీరెలా వెళ్తారంటూ వారు నిలదీశారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి దశమంతరెడ్డి ఫోన్ చేసి చెప్పారు. అక్కడే ఉన్న రమేశ్‌తో కిషన్‌రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. తాను వ్యక్తిగత పనుల నిమిత్తమే ఎర్రబెల్లితో కలిసి హైదరాబాద్ వెళ్తున్నానని, ఇచ్చిన మాట ప్రకారం బీజేపీలో చేరేందుకు సిద్ధంగానే ఉన్నానని రమేశ్ చెప్పారు. కిషన్‌రెడ్డి సూచన మేరకు బీజేపీ నేతలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఉద్రిక్తత మధ్య రమేశ్‌తోపాటు బీఆర్ఎస్ నేతలు హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసానికి చేరుకున్నారు.

బీఆర్ఎస్ నుంచి పోటీకి ఆరూరి నో?

వరంగల్ పార్లమెంట్ స్థానానికి సంబంధించిన అభ్యర్థిత్వంపై చర్చించేందుకు పార్టీ నాయకులతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమావేశమ్యారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ పేరును ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్వయంగా ప్రతిపాదించగా.. మిగతా నేతలు మొగ్గు చూపారు. కానీ, ఎంపీ అభ్యర్థిగా తాను పోటీ చేసేది లేదని ఆరూరి స్పష్టం చేసినట్టు సమాచారం. ఇంత జరిగిన తర్వాత ఎంపీగా పోటీ చేయనని, అదే సమయంలో పార్టీ కూడా మారనని, పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా కలిసి పని చేస్తానని ఆరూరి అధినేతకు చెప్పినట్టు తెలిసింది. దీంతో కేటీఆర్ కలుగజేసుకుని రమేశ్‌ను ఒప్పించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. "అధికారంలో లేమని.. హైరానా పడకండి.. తెలంగాణలో బీఆర్ఎస్‌దే భవిష్యత్తు అనే విషయాన్ని తెలుసుకోండి. అనవసర నిర్ణయాలతో రాజకీయ భవిష్యత్తు పాడు చేసుకోవద్దు" అని రమేశ్‌ను ఉద్దేశించి కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. చివరకు అనూహ్యంగా వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను కేసీఆర్ ప్రకటించారు.

నన్నెవరూ కిడ్నాప్ చేయలేదు: ఆరూరి

"నన్నెవరూ అడ్డుకోలేదు.. బీఆర్ఎస్ నేతలు కిడ్నాప్ చేయలేదు.. వరంగల్ నేతలతో అధినేత కేసీఆర్ నిర్వహిస్తున్న సమావేశంలో పాల్గొనేందుకే హైదరాబాద్ వచ్చా" అని ఆరూరి రమేశ్ పేర్కొన్నారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. తమ పార్టీ నేతలే నన్ను తీసుకుని వచ్చారని వెల్లడించారు. అమిత్‌షా సహా బీజేపీ నేతలెవరినీ తాను కలవలేదని పేర్కొన్నారు.



కాసాని జ్ఞానేశ్వర్



కడియం కావ్య



బాజిరెడ్డి గోవర్ధన్



గాలి అనిల్‌కుమార్

చేవెళ్ల నుంచి కాసాని, వరంగల్ నుంచి కావ్య

» నిజామాబాద్‌లో బాజిరెడ్డి, జహీరాబాద్‌లో అనిల్

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగు పార్లమెంట్ స్థానాల్లో బీఆర్ఎస్ తరఫున పోటీ చేసే అభ్యర్థుల పేర్లను పార్టీ అధినేత కేసీఆర్ బుధవారం ప్రకటించారు. పార్టీ ముఖ్య నేతలతో చర్చల అనంతరం వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. అదే విధంగా చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్‌కుమార్, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పేర్లను ప్రకటించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో 50శాతానికి పైగా బీసీలే ఉండడం, గతంలో ఆర్మూర్, బాన్సువాడ ఎమ్మెల్యేగా పని చేసి ఉండడం, జిల్లాలో అందరికీ తెలిసిన వ్యక్తిగా పేరుండడంతో బాజిరెడ్డి గోవర్ధన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. మరోవైపు, జహీరాబాద్ సిటింగ్ ఎంపీ బీబీ పాటిల్ బీజేపీలో చేరడంతో ఆ స్థానానికి పఠాన్‌చెరువుకు చెందిన సీనియర్ నేత అనిల్ కుమార్‌ను ఎంపిక చేశారు. పార్టీలో చాలా కాలంగా పని చేస్తుండడం, బీసీ అభ్యర్థి కావడం కలిసొస్తుందన్న అంచనాతో ఆయన ఎంపిక జరిగింది. తాజా ప్రకటనతో మొత్తం తొమ్మిది పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది.

కష్టకాలంలో కాంగ్రెస్ ఉనికిని కాపాడాం

పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొన్నాం.. మెదక్ లోక్‌సభ టికెట్ నాకు ఇవ్వండి

» నేనూ నా భర్త జగ్గారెడ్డి గెలిపించుకొస్తాం

» దీపాదాస్ మున్షీని కోరిన నిర్మలా జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): "గడిచిన పదేళ్లుగా కేసీఆర్ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ మెదక్ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని కాపాడుకొచ్చాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పోటీ చేసి ఉనికిని చాటాం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ టికెట్‌ను నాకు ఇస్తే.. గెలిపించి ఇస్తాం"ని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి సతీమణి, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కోరారు. మెదక్ లోక్‌సభ స్థానంలో గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గెలవలేదని, బీసీ మహిళ అయిన తనకు టికెట్ ఇస్తే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి 13 నియోజకవర్గాలకు చెందిన డీసీసీల అధ్యక్షులు, పార్టీ ఎమ్మెల్యేలు, గతంలో పోటీ చేసిన అభ్యర్థులతో బుధవారం గాంధీ భవన్‌లో దీపాదాస్ మున్షీ సమావేశాలు నిర్వహించారు. ఈ క్రమంలో నిర్మలా జగ్గారెడ్డితో సమావేశమైనప్పుడు ఆమె స్థానికంగా తాను, తన భర్త జగ్గారెడ్డి కాంగ్రెస్ పార్టీని ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ వివరించారు. జిల్లాలో గత పదేళ్లుగా కేసీఆర్ కుటుంబ ఆధిపత్యాన్ని ఎదుర్కొంటూ వస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులను బీఆర్ఎస్‌లో చేర్చుకుందని గుర్తుచేశారు. కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు మెదక్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలు వస్తే.. పార్టీ ఉనికిని చాటేందుకు తాను పోటీ చేశానన్నారు. మెదక్‌లో కాంగ్రెస్‌కు ఉన్న ప్రజాప్రతినిధుల కంటే అదనంగా 9 ఓట్లు వచ్చాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది కాబట్టి ఇప్పుడు మెదక్ సీటు కోసం చాలామంది వస్తున్నారని, కష్టకాలంలో పార్టీని కాపాడుకుంటూ వచ్చిన తమకు టికెట్ కేటాయించాలని కోరారు. బాగారెడ్డి తర్వాత గడిచిన 30 ఏళ్లలో మెదక్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరూ గెలవలేదని, తనకు మెదక్ టికెట్ కేటాయిస్తే తాను, తన భర్త జగ్గారెడ్డి కలిసి గెలిపించుకుని వస్తామన్నారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ తన అభ్యర్థనపై అధిష్ఠానం సానుకూలంగా స్పందిస్తుందని భావిస్తున్నానని చెప్పారు. జగ్గారెడ్డి సైతం దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శులను కలిసి తన భార్యకు మెదక్ టికెట్ ఇవ్వాలని కోరారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాలో ఎలా కాపాడుకుంటూ వచ్చిందీ, సంగారెడ్డిలో రాహుల్ సభను, భారత్ జోడో యాత్రను విజయవంతంగా నిర్వహించిన తీరును వివరించారు.



రాష్ట్ర ప్రభుత్వాన్ని పడగొట్టే ఉద్దేశం

బీజేపీకి లేదు

» పడగొట్టుకుంటే మీరే బాధ్యులు:లక్ష్మణ్

హైదరాబాద్, ముషీరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాము రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కోరుకోవడం లేదని బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ తెలిపారు. 8 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటు చేస్తుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఓ ప్రకటనలో అలాగే ముషీరాబాద్‌లోని కపిష్ హాల్‌లో జరిగిన మోదీ పౌష్టికాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో స్పందించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. "కాంగ్రెస్ నేతలు... వారంతట వారే తగవు పడి ప్రభుత్వాన్ని పడగొట్టుకుంటే బాధ్యత వారిదే" అని వ్యాఖ్యానించారు. చచ్చిన పామైపోయిన.. బతికి బట్టగట్టే పరిస్థితే లేని బీఆర్ఎస్ పార్టీని బతికించే అగత్యం బీజేపీకి లేదన్నారు. బీఆర్ఎస్‌తో కలిసి బీజేపీ కుట్ర పన్నుతోందంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఈమేరకు స్పందించారు. మా ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే కాపాడతారని సీఎంయే పేర్కొంటూ ప్రభుత్వం పడిపోతుందని ఎందుకు భావిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటయ్యాయని వారి మాటల్లోనే అర్థమవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల, ఆ పార్టీ విధానాల పట్ల రేవంత్‌రెడ్డికి విశ్వాసం ఉంటే.. ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని ప్రకటించాలని సవాల్ విసిరారు.

స్వార్థం కోసమే విమోచన దినం:తమ్మినేని

హైదరాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఇది చరిత్రను వక్రీకరించడమే అని బుధవారం పేర్కొన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే ఆ నోటిఫికేషన్ విడుదల చేశారని, తక్షణమే దానిని ఉపసంహరించుకోవాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

అరుణకు సై.. జితేందర్‌కు నై!

(మొదటిపేజీ తరువాయి)





అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ సీటు కేటాయించగా అక్కడ ఆయన ఓటమి పాలయ్యారు. పైగా డీకే అరుణకు టికెట్ ఇస్తేనే గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని బీజేపీ పెద్దలు భావించినట్లు సమాచారం. ఆదిలాబాద్ నుంచి సిటింగ్ ఎంపీ సోయం బాపురావును కాదని మూడు రోజుల పార్టీలో చేరిన గోడెం నగేశ్‌కు టికెట్ ఇవ్వడం చర్చనీయాంశమైంది. 2014లో నగేశ్ బీఆర్ఎస్ తరఫున ఆదిలాబాద్ నుంచి ఎంపీగా గెలిచారు. 2019లో బీజేపీ అభ్యర్థి సోయం బాపురావు చేతిలో ఓటమిపాలయ్యారు. కాగా ఆదిలాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేల్లో ఒకరిద్దరు సోయం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించారని, ఇదే ప్రభావం చూపించదనే చర్చ నడుస్తోంది. ఇదివరకే మొదటి జాబితాలో తెలంగాణ నుంచి తొమ్మిది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తం 17 స్థానాలకు గాను 15 స్థానాల్లో అభ్యర్థులను అభ్యర్థులను ప్రకటించినట్లయింది. వీరిలో ఇద్దరు మహిళా అభ్యర్థులు మాధవీలత (హైదరాబాద్), డీకే అరుణ (మహబూబ్‌నగర్) ఉన్నారు.

పెండింగ్‌లో ఖమ్మం, వరంగల్ స్థానాలు

తెలంగాణ నుంచి బీజేపీ ప్రకటించాల్సిన స్థానాలు ఇక రెండే రెండు ఉన్నాయి. ఖమ్మం, వరంగల్! మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఇటీవలే బీజేపీలో చేరారు. ఖమ్మం లోక్‌సభ నుంచి వెంకట్రావ్ బరిలో ఉంటారని ప్రచారం జరిగింది. రెండో జాబితాలో ఆయన పేరును ప్రకటిస్తారనీ పార్టీ వర్గాలు చెప్పాయి. చివరి నిమిషంలో ఆయన పేరును జాబితాలో చేర్చలేదు. బీఆర్ఎస్ నుంచి ఖమ్మం జిల్లాకు చెందిన ఓ కీలక నేత బీజేపీలో చేరనున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఖమ్మం స్థానాన్ని పెండింగ్‌లో పెట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక వరంగల్ నుంచి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌ను రంగంలోకి దింపాలని బీజేపీ చూసింది. ఆయనతో చర్చలు కూడా జరిపింది. రమేశ్ బుధవారం పార్టీలో చేరతారని ప్రచారం జరిగింది. చివరి నిమిషంలో తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని ఆయన ప్రకటించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో ఆరూరి సమావేశమయ్యారు. వీటన్నింటి నేపథ్యంలో వరంగల్ నుంచి మాజీ ఐపీఎస్ కృష్ణ ప్రసాద్ అభ్యరిత్వాన్ని దాదాపుగా ఖరారు చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి.

రెండో జాబితాలో గడ్కరీ, గోయల్, అనురాగ్ ఠాకూర్‌కు

ఓవరాల్‌గా రెండో జాబితాలో నితిన్ గడ్కరీ (నాగపూర్), ప్రహ్లాద్ జోషి (ధార్వాడ్), పీయూష్ గోయల్ (ముంబై నార్త్), అనురాగ్ ఠాకూర్ (హమిర్‌పూర్) తోపాటు మాజీ ముఖ్యమంత్రులు మనోహర్ లాల్ ఖట్టర్(కర్నాల్), త్రివేంద్రసింగ్ రావత్ (హరిద్వార్), బసవరాజ్ బొమ్మై (హవేరీ)కి చోటు దక్కింది. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప తనయుడు రాఘవేంద్ర.. షిమోగ లోక్ సభ స్థానం నుంచి బరిలో నిలవనున్నారు. దేశంలో మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. తొలి జాబితాలో 195 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో మొత్తంగా 267 స్థానాలకు బీజేపీ అభ్యర్థులను ప్రకటించినట్లయింది. ఎన్డీఏ కూటమిలో భాగంగా కొన్ని రాష్ట్రాల్లో అవగాహనతో ముందుకెళ్లాలని బీజేపీ భావిస్తోంది. అందులో భాగంగానే మరి కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్నాయి. పొత్తులు, పోటీ చేసే సీట్ల విషయంలో పూర్తి అవగాహనకు వచ్చాక మిగిలిన లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించాలని బీజేపీ భావిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

16న నాగర్‌కర్నూల్‌కు మోదీ

భారీ బహిరంగ సభకు బీజేపీ ఏర్పాట్లు

నాగర్‌కర్నూల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాగర్‌కర్నూల్ పర్యటన ఖరారయింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని శనివారం(16న) నాగర్‌కర్నూల్‌కు వస్తున్నారు. దాంతో వెలమ సంఘం కల్యాణ మండపం పక్కన భారీ బహిరంగ సభ నిర్వహణకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రముఖ బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం సన్నాహక సమావేశం జరిగింది. మోదీ తొలిసారి నాగర్‌కర్నూల్‌కు వస్తున్నందున భారీ ఎత్తున జనసమీకరణ చేయాలని బీజేపీ నాయకులు నిర్ణయించారు. అందుకోసం సభకు ఉమ్మడి జిల్లా, బీజేపీ పట్టు ఉన్న ప్రాంతాల నుంచే కాకుండా మిగతా నియోజకవర్గాల నుంచి కూడా జనాన్ని తరలింగే ప్రయత్నాలు చేస్తున్నారు.

విమోచన గెజిట్‌పై బీజేపీ హర్షం

సెప్టెంబరు 17ను హైదరాబాద్ విమోచన దినంగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలకు కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ స్వాతంత్ర్యం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన మహనీయులందరికీ సరైన గౌరవం దక్కిందన్నారు. అభినవ సర్దార్ వల్లభాయ్ పటేల్ అయిన అమిత్ షా నేతృత్వంలో సెప్టెంబరు 17న విమోచన దినోత్సవంగా నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ కావడం చారిత్రాత్మకమన్నారు.

సీపీఎం సీనియర్ నేత మృతి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 13: మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వెన్నకూన నర్సయ్య (80) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఉడుత రవీందర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య వచ్చి మృతదేహంపై పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ సర్పంచ్ జక్కుల పరుశరాములు, మందపురం ఎల్లాగౌడ్, సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, గట్ల మల్లారెడ్డి, కొడెపాక యాకయ్య, కడుదుల నర్సిరెడ్డి తదితరులు నివాళి అర్పించారు.

రాష్ట్రస్థాయికి తిమ్మంపేట బాలికలు

సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులు


బాలికలను అభినందిస్తున్న హెచ్‌ఎం జయప్రకాశ్, ఉపాధ్యాయులు

జఫర్‌గడ్, మార్చి 13: తిమ్మంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళవారం జనగామలో జరిగిన జిల్లా స్థాయి బాలికల సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో తిమ్మంపేట హైస్కూల్‌కు చెందిన లాకావత్ దీపిక, మాచర్ల రిషిత, పెండ్లి నిఖిత, బుల్లె స్పందన (8వ తరగతి), భూక్య రాణి, పెండ్లి రోష్ని (7వ తరగతి) బాలికలు పాల్గొని విశేష క్రీడా ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు మంగు జయప్రకాశ్, పీఈటీ కొండ రవి తెలిపారు. వీరు ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు అదిలాబాద్ జిల్లాలోని నేరడిగొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా, ఎంపికైన విద్యార్థులను బుధవారం జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మంద మల్లేశ్, పాఠశాల శాశ్వత క్రీడా దాత చాడ ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బచ్చన్నపేట, మార్చి 13: మండలంలోని బసిరెడ్డిపల్లి, కేశిరెడ్డిపల్లి గ్రామాలలో అభివృద్ధి పనులకు బుధవారం ఎంపీటీసీలు నీల శైలజ రమేశ్, కర్నాల వేణుగోపాల్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బసిరెడ్డిపల్లిలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 2.20 లక్షలు, కేశిరెడ్డిపల్లిలో రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రూ. 3.50 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, నీల రమేశ్, కాపర్తి హరిప్రసాద్, గ్రామ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకులంలో డ్రెయినేజీ పనులు ప్రారంభం

పాలకుర్తి: మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం డ్రెయినేజీ పనులను ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో గతంలో నిర్మించిన డ్రైనేజీ పూడిపోయినందున పాలకుర్తి జడ్పీకోఆప్షన్ సభ్యుడు ఎండి మదార్‌కు కేటాయించిన రూ.3 లక్షలతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు సర్వర్‌ఖాన్, మాజీ సర్పంచు యాకాంతరావు, పెనుగొండ రమేష్, కమ్మగాని నాగయ తదితరులు పాల్గొన్నారు.

డిపో కల్లు.. అక్రమాలు ఫుల్లు

- తొమ్మిదేళ్లుగా సొసైటీ కార్యవర్గం లేకుండానే విక్రయం
- నెలకు రూ.3 లక్షల ఆదాయం
- ఎక్సైజ్ అధికారులు, గౌడ పెద్దలు కుమ్మక్కై దందా
- ఆడిట్, మినిట్ బుక్ లేకుండా అమ్మకాలెలా?
- గతంలో కోట్ల విలువైన భూమి అమ్మకం


విక్రయానికి సిద్ధంగా డిపో కల్లు

జనగామ టౌన్, మార్చి 12: సొసైటీ అంటే అందరినీ రక్షించేలా ఉండాలి. పది మందికి ఉపయోగపడేలా ఉండాలి.. నాలుగు రూపాయలు పొదుపు చేసి సభ్యులను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా ఉండాలి.. కానీ జనగామ కల్లుగీత పారిశ్రామిక సొసైటీ అందుకు భిన్నంగా తయారైంది. కొందరు అక్రమార్కులు సొసైటీని అస్తవ్యస్తంగా మార్చేసి దాని ఆదాయాన్ని అడ్డదారిలో వారి సొంతం చేసుకుంటున్నారు. గతంలో సొసైటీకి సంబంధించిన విలువైన భూమిని అమ్మిన ఉదంతం మరువక ముందే మరో కల్లు మాఫియా వ్యవహారం సొసైటీ పేరిట జరిగే అవినీతికి అద్దం పడుతోంది. జనగామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘంలో సుమారు వంద మంది వరకు సభ్యులున్నారు. ఈ సొసైటీకి ప్రతీ ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకునేవారు. కానీ కొన్ని సంవత్సరాల కింద కార్యవర్గ కాలపరిమితిని ప్రభుత్వం ఐదేళ్ల నుంచి రెండేళ్లకు కుదించింది. అంటే రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలి. కానీ తొమ్మిదేళ్లుగా జనగామ సహకార సంఘానికి ఎన్నికలు నిర్వహించకుండా జాప్యం చేస్తున్నారు. కార్యవర్గం లేకపోవడంతో డిపో పేరిట అక్రమాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు ఎన్నికల నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో సహకారం సంఘానికి రావాల్సిన ఆదాయాన్ని కొందరు వ్యక్తులు మింగేస్తున్నారు.

రోజుకు రూ.10 వేలు పక్కదారి..

జనగామ కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘానికి సంబంధించిన కల్లు డిపో నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. సాధారణంగా కార్యవర్గం పర్యవేక్షణలో కల్లు డిపోను నిర్వహించి దానికి సంబంధించి ఆడిట్ బుక్, మినిట్ బుక్ నిర్వహించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన లాభనష్టాలో ప్రతీ సభ్యుడు పాలుపంచుకోవాలి. కానీ ఇక్కడ అదేమీ జరగడం లేదు. కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘానికి చివరిసారి 2010లో ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకోగా.. దాని కాలపరిమితి 2015లో ముగిసింది. ఆ తరువాత రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ అప్పటి నుంచి ఇప్పటివరకు తొమ్మిదేళ్లుగా సంబంధిత అధికారులు కల్లుగీత సొసైటీకి ఎన్నికలు నిర్వహించలేదు. దీని వెనుక వ్యూహాత్మక మోసం ఉన్నట్లు సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. సొసైటీకి సంబంధించి ఓ విలువైన భూమిపై కుల పెద్దల కన్ను పడింది. ఆ భూమిని ఓ వ్యక్తికి సభ్యుల అభిప్రాయాలు తీసుకోకుండా కొందరు కుల పెద్దలు అమ్మేశారు. మరోవైపు ప్రతీ రోజు కల్లు ద్వారా వచ్చే ఆదాయం కూడా వారి జేబుల్లోకే వెళ్తోంది. కార్యవర్గం ఉంటే ఇవన్నీ కుదరవనే ఉద్దేశంతోనే కొందరు అక్రమార్కులు ఎక్సైజ్ అధికారులకు మామూళ్ల ఎర చూపి ఎన్నికలు జరుగకుండా అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఎన్నికలపై నిలదీస్తే సహకార శాఖ వారిని అడగండంటూ ఎక్సైజ్ అధికారులు బుకాయిస్తున్నారు. అయితే ఎక్సైజ్ శాఖ నుంచి ప్రపోజల్ పెడితే ఎన్నికల నిర్వహణను సహకార శాఖ వారు చూస్తారు. కానీ ఈ విషయంలో సహకార శాఖ వారి సాకు చూపుతూ ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఎన్నికలు నిర్వహించకుండా, కార్యవర్గం లేకుండా డిపో కల్లు తయారు చేయడమే నేరం. అలాంటిది కొందరు వ్యక్తులు అక్రమంగా డిపో కల్లు తయారుచేసి జనగామ పట్టణంలోని సుమారు ఐదు షాపుల ద్వారా విక్రయిస్తున్నారు. వీటి ద్వారా దాదాపు రోజుకు రూ.10 వేల చొప్పున నెలకు రూ.3 లక్షల ఆదాయం వస్తోంది. ఇందులో కొంత మొత్తాన్ని ఎక్సైజ్ శాఖలోని పలువురు అధికారులకు అప్పజెప్పి.. మిగతా మొత్తం కొందరు కులపెద్దలు తమ జేబుల్లో వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ డిపో కల్లు తాగి ఎవరికైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

సొసైటీ ఆస్తి గద్దల పాలు..

తొమ్మిదేళ్లుగా సహకార సంఘానికి కార్యవర్గం లేనప్పటికీ పాత కార్యవర్గానికి సంబంధించిన కొందరు పెద్దలు పలు కార్యకలాపాలు నిర్వహిస్తూనే ఉన్నారు. అనధికారికంగా సొసైటీకి సంబంధించిన ఆదాయాన్ని సొంతం చేసుకుంటున్నారు. సొసైటీకి సంబంధించి జనగామ పట్టణ పరిధిలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఉన్న రెండకరాల భూమిని సుమారు మూడు సంవత్సరాల క్రితం ఓ వ్యాపారికి సుమారు రూ.4 కోట్లకు విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ భూమిని ప్లాట్లుగా చేసి సభ్యులకు ఇవ్వాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. భూమి అమ్మారనే విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సొసైటీ సభ్యులు కుటుంబాలతో సహా పలుమార్లు ఆందోళనలు చేశారు. సదరు భూమిలో గుడిసెలు వేసి నిరాహార దీక్షలు సైతం చేశారు. జాతీయ రహదారి పక్కనున్న భూమిని అమ్మడానికి కొందరు కుల పెద్దలకు ఎలాంటి అధికారాలు లేనప్పటికీ అధికారులను డబ్బులతో మ్యానేజ్ చేసి కొనుగోలుదారుడిని బురిడీ కొట్టించి విక్రయించినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో పలువురిపై పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఎన్నికలు పెట్టి కార్యవర్గాన్ని ఎన్నుకుంటేనే ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని సభ్యులు ఎక్సైజ్ అధికారులను వేడుకుంటున్నారు. లేదంటే సొసైటీ భ్రష్టు పట్టి రద్దయ్యే ప్రమాదముందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు సహకార శాఖ అధికారులకు ప్రపోజల్ పంపించి ఎన్నికలు జరిగేలా చూడాలని, సొసైటీలో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పరీక్షలంటే భయం వద్దు

ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి రమేశ్


కూనూరులో టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రమేశ్

జఫర్‌గడ్, మార్చి 13 : పరీక్షలంటే ఎలాంటి ఒత్తిడులు, భయాందోళనకు గురి కావద్దని ఇంపాక్ట్ ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.రమేశ్ విద్యార్థులకు సూచించారు. కూనూరు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం టెన్త్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి రమేశ్ మాట్లాడుతూ రాబోయే టెన్త్ వార్షిక పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలకు సన్నద్ధత, ఏకాగ్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పరీక్ష కిట్లు బహూకరణ..

కూనూరు హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు ఇదే పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎస్.రాజేందర్ రూ.15 వేల విలువ గల పరీక్ష కిట్లను బహూకరించారు. వార్షిక పరీక్షల్లో ప్రతిభను చాటి ఉత్తమ గ్రేడ్లతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు రమేశ్‌బాబు, చంద్రమోహన్, రవి, ప్రభాకర్, గిరిజ, స్వరూపారాణి, విజయశ్రీ, కరుణశ్రీ, సిరాజ్, యాదగిరి, ఉమ, శ్రీనివాస్, విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

జనగామ డీఎంహెచ్‌వోగా హరీశ్‌రాజ్



జనగామ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా హరీశ్‌రాజ్ నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీంద్రనాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జనగామ డీఎంహెచ్‌వోగా ఆర్.శ్రీదేవి విధులు నిర్వర్తిస్తుండగా ఆమె స్థానంలో వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ ఆర్ఎంవో, వరంగల్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న హరీశ్‌రాజ్‌ను జనగామ డీఎంహెచ్‌వోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2016లో జిల్లా ఆవిర్భావ సమయంలో జిల్లా మొదటి డీఎంహెచ్‌వోగా హరీశ్‌రాజ్ 8 నెలల పాటు విధులు నిర్వహించగా తిరిగి ఆయన మళ్లీ జనగామకు వస్తున్నారు.

దివ్యాంగులకు ఉపకరణల పంపిణీ


దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న ఆర్డీవో, ఎంపీపీ, డిడబ్ల్యూవో

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 13: దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో డీఎస్ వెంకన్న కోరారు. బుధవారం డివిజన్ కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి వచ్చిన 5 ట్రై సైకిల్స్, 3 ట్రై మోటార్ సైకిల్స్‌ను ఆర్డీవో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఎప్పుడూ అధైర్యపడవద్దు అన్నారు. అంగవైకల్యం అనేది కేవలం మీ శరీరానికే తప్ప మీ మేధస్సుకు కాదన్నారు. మనోధైర్యంతో దూసుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ-గట్టయ్య, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో సుధీర్‌కుమార్, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సీడీపీవో ఫ్లోరెన్స్, సూపర్‌వైజర్లు సంధ్యారాణి, దివ్య, సుజాత, ఎంపీటీసీ గన్ను నర్సింహులుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బోనాల్లో మనోళ్లు బెస్ట్

ఉత్తమ అవార్డుకు ఎంపికైన నెల్లుట్ల మహిళలు


బండి రాములమ్మ


గొరిగె నీల

లింగాలఘణపురం, మార్చి13: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా లింగాలఘణపురం మండలానికి చెందిన ఇద్దరు మహిళా కళాకారులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారు. స్పోర్ట్స్, లిటరేచర్, విద్య, హస్తకళలు, సామాజిక సేవ, డ్యాన్స్, పేరిణి నాట్యం, డప్పు, బోనాలు తదితర 13 విభాగాల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన 19 మందిని ఎంపిక చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో నెల్లుట్లకు చెందిన బండి రాములమ్మ, గొరిగె నీల బోనాల కోలాటం విభాగంలో ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఇద్దరు కళాకారులు ఎంపిక కాగా వారిద్దరు కూడా లింగాలఘణపురం మండలం నెల్లుట్లకు చెందిన వారే కావడం గర్వకారణం. వీరికి ఈనెల 14న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.1 లక్ష చొప్పున నగదు ప్రోత్సాహకం అందించి సత్కరిస్తారు. ఈసందర్భంగా కళాకారులు రాములమ్మ, నీల మాట్లాడుతూ మరుగున పడిపోతున్న కళలను వెలికి తీసేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేయడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ డైరెక్టర్‌కు ప్రముఖ ఒగ్గు కళాకారుడు ఉస్తాద్ ఒగ్గు రవి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ గుడ్‌బై


బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

జనగామ టౌన్, మార్చి 13: కాంగ్రెస్ పార్టీలోకి చేరికల జోరు నడుస్తోంది. రోజురోజుకూ పలు పార్టీల నుంచి అధికార పార్టీలోకి చేరే వారి సంఖ్య పెరుగుతోంది. బుధవారం జిల్లాకేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో జనగామ జడ్పీటీసీ నిమ్మతి దీపిక బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లో చేరారు. ఆమెతో పాటు జనగామ మండలం చీటకోడూరు పీఏసీఎస్ చైర్మన్ చిర్రా శ్రీనివాస్‌రెడ్డి, జనగామ మండల పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాగితపురం మహేందర్ కారు దిగి హస్తం గూటికి చేరారు. సుమారు 200 మంది కార్యకర్తలతో కలిసి వీరంతా కాంగ్రెస్‌లో చేరగా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు కొన్నె మహేందర్‌రెడ్డి, బాల్నే నరేశ్‌గౌడ్, కర్రె రాజశేఖర్, వట్నాల రామకృష్ణ, ఎండీ. యాసిన్, బీర్రు నర్సింహులు, కొమ్మరాజుల పరుశరాములు, పెండ్లి చందు, నవీన్, మారపాక కృష్ణ, వంగాల మల్లేశ్, కుమార్, రవి, రాములు, రాజు తదితరులు ఉన్నారు.

డీజే సౌండ్స్ నిషేధం

- టెన్త్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ



స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 13: డీజే సౌండ్స్‌ను పూర్తిగా నిషేధిస్తున్నామని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ ఆర్.భీమ్‌శర్మ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. డీజే సౌండ్స్‌తో అనేక ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటి వినియోగాన్ని ప్రజలు పూర్తిగా మానుకోవాలని సూచించారు. డీజే సౌండ్స్‌తో మానవుల మెదడులో ఉండే అతి సన్నని నరాలు చిట్లిపోతాయని, మెదడులో రక్తస్రావం జరిగి అనేక మంది తీవ్ర అనారోగ్యానికి గురవుతారని అన్నారు. ప్రజలు చైతన్యమై గ్రామాల్లో డీజే సౌండ్స్‌ను అడ్డుకోవాలని, లేదంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ నెల18 నుంచి ప్రారంభం కానున్న పదవతరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎవరు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా తీవ్ర చర్యలుంటాయని హెచ్చరించారు. పరీక్షలు ప్రశాంత వాతవరణంలో జరిగేలా చూడాలి తప్ప సెంటర్ల వద్ద అలజడులు సృష్టించవద్దు అన్నారు. పరీక్ష జరిగే సమయంలో సెంటర్ల సమీపంలో ఎలాంటి మైక్ సౌండ్స్ కాని, ప్రచార వాహనాలను కాని అనుమతించేదిలేదని స్పష్టం చేశారు.

ఎర్రబెల్లితో ఎట్ల పోతవన్న?

అరూరిని నిలదీసిన బీజేపీ నాయకులు

హైదరాబాద్‌కు వెళ్తుండగా పెంబర్తిలో అడ్డగింత


అరూరిని కారులోంచి కిందికి దింపుతున్న బీజేపీ కార్యకర్తలు

జనగామ టౌన్, మార్చి 13: 'బీజేపీలో చేరుతనన్నవ్.. ఇప్పుడేమో ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి కేసీఆర్ దగ్గరికి పోతున్నవ్. వ్యక్తిగత పని ఉంటే మా బండిలో దింపుతాం.. లేదంటే నీ బండిలో పోవాలే.. కానీ ఎర్రబెల్లి బండిలో పోవుడేందన్న' అంటూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను నిలదీశారు. బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించిన అరూరిని బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అరూరి రమేష్‌ను హైదరాబాద్ తీసుకెళుతున్నాడన్న విషయం తెలుసుకుని బీజేపీ నాయకులు కంగు తిన్నారు. బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతిరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 50 మంది అరూర్ రమేష్‌ను తీసుకెళుతున్న ఎర్రబెల్లి వాహనాన్ని పెంబర్తి వద్ద అడ్డుకుని వెనుక సీట్లో కూర్చున్న అరూరిని బలవంతంగా కిందికి దింపారు. ఎర్రబెల్లి వాహనంలో ఎందుకు వెళ్తున్నారో చెప్పాలంటూ నిలదీశారు. ఈ క్రమంలో అరూరి రమేశ్ చొక్కా చినిగింది. బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించగానే బీఆర్ఎస్ నేతలు బుజ్జగింపులకు దిగారని, వారి బుజ్జగింపులకు లొంగిపోతే ఎలా అని రమేశ్‌ను ప్రశ్నించిన దశమంతరెడ్డి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఫోన్ చేసి మాట్లాడించారు. ఈ క్రమంలో కిషన్‌రెడ్డితో మాట్లాడిన అరూరి తాను వ్యక్తిగత పనుల నిమిత్తమే ఎర్రబెల్లితో హైదరాబాద్‌కు వెళ్తున్నానని, తాను ఇచ్చిన మాట ప్రకారం బీజేపీలో చేరేందుకు సిద్ధంగానే ఉన్నానని చెప్పారు. దీంతో కిషన్‌రెడ్డి సూచన మేరకు బీజేపీ నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆకతాయిని రిమాండ్ చేసిన పోలీసులు

పాలకుర్తి, మార్చి 13 : ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న ఆకతాయిని పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన వంగాల ప్రవీన్ అనే యువకుడు ఓ యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. పెళ్లి చేసుకోవాలని లేదంటే ఏదైనా చేస్తానని బెదిరించాడు. దీంతో విసుగు చెందిన యువతి ఈ నెల 9వ తేదీన పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని బుధవారం జనగామ కోర్టులో హాజరు పరిచారు.

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు


ఎర్రబెల్లితో కలిసి కేసీఆర్‌ను కలిసిన సుందర్‌రామ్‌రెడ్డి

దేవరుప్పుల, మార్చి 13: మండలంలోని సీర్మాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. ఈసందర్భంగా జిల్లాలో పంటల పరిస్థితి వివరించారు. గోదావరి జలాలు అందక పలు గ్రామాల్లో పొలాలు ఎండిపోతున్నాయని, కాంగ్రెస్ పాలనలో వెనకటి కరువు రోజులు మళ్లీ వచ్చాయని, ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత వస్తోందని వివరించారు.

బస్ షెల్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన గ్రామస్థుడు

రఘునాథపల్లి, మార్చి 13: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ వద్ద బస్ షెల్టర్ ఏర్పాటు కోసం తన సొంత డబ్బులు వెచ్చించడానికి వెల్ది గ్రామానికి చెందిన గుర్రాల లక్ష్మణ్ ముందుకు వచ్చారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మోడల్ స్కూల్‌కు విద్యార్థులు వస్తున్నారు. వీరికి బస్ షెల్టర్ లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన లక్ష్మణ్ సొంతంగా బస్ షెల్టర్ నిర్మించడానికి పూనుకున్నారు. ఈ మేరకు మోడల్ స్కూల్ సమీపంలో బస్ షెల్టర్ నిర్మాణానికి లక్ష్మణ్‌తో పాటు గ్రామస్థులు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, చెంచు రమేష్, పెదగోని ఉప్పలయ్య, రాసమల్ల కొంరయ్య, యాదగిరి, రవి, రాములు,భూపాల్ రెడ్డి, సుధాకర్, కొయ్యడ స్వామి, మల్లేష్, యాదిరెడ్డి, జీడికంటి నాగరాజు, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

జఫర్‌గడ్, మార్చి 13 : మండలంలోని రఘునాథ్‌పల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరిస్తామని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరిస్తారన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పొలిటికల్.. హైడ్రామా..!

(3వ పేజీ తరువాయి)

కాలేదని, అరూరి కోసమే ఈ స్థానాన్ని పెండింగ్ పెట్టిందన్న చర్చ జరుగుతోంది. ఇక అరూరి పోటీకి నో చెప్పడంతో అధినేత కడియం కావ్యను అభ్యర్థిగా ఖరారు చేశారన్న చర్చ జరుగుతోంది.

బీజేపీ ఎదురుచూసేది అరూరి కోసమేనా?

దేశవ్యాప్తంగా పలుస్థానాలకు రెండో జాబితాను ప్రకటించిన బీజేపీ రాష్ట్రంలో ఆరు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం, వరంగల్ స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. అయితే వరంగల్ స్థానాన్ని అరూరి రమేష్ కోసమే పెండింగ్‌లో పెట్టిందనే ప్రచారం జరుగుతోంది. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ సొంత జిల్లా కావడంతో వరంగల్ స్థానాన్ని పక్కాగా గెలిపించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అందుకే బీఆర్ఎస్ నుంచి పోటీ చేయాలని ఆఫరు ఇచ్చినా అరూరి తిరస్కరించారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.